క్లుప్తంగా

వాల్మీకి మహర్షికి నివాళి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.రమాదేవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పుట్ట నుంచి వచ్చినవాడే వాల్మీకి అయ్యాడని వివరించారు. వాల్మీకి రామాయణాన్ని రచించి శ్రీరాముడిని లోకోత్తర పురుషునిగా చిత్రీకరించిన మహర్షి అని పేర్కొన్నారు. గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పౌర్ణమిని పురస్కరించుకుని మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు.

పెచ్చులూడుతున్న శ్లాబు



పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలోని 281వార్డు సచివాలయ కార్యాలయం బిల్డింగ్ శ్లాబు పెచ్చులు ఊడిపడుతుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ప్రజలు వివిధ పనుల మీద కార్యాలయానికి వస్తుంటారు. సచివాలయం సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తుంటారు. భవనం పిల్లర్లు శిథిలావస్థకు చేరడంతోపాటు శ్లాబు పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఉద్యోగులు, ఆయా పనులపై సచివాలయానికి వచ్చే జనం భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మూలమంత్ర పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆశ్వియుజ పూర్ణిమ సందర్భంగా గురువారం మధురానగర్ స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో విశ్వస్ఫూర్తి మూలమంత్ర పారాయణం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ కోశాధికారి చొప్పవరపు నారాయణరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక విశ్వ గురువుల ఆశీస్సులతో లోక కళ్యాణార్థం విశ్వగురువు మానవాళికి అందించిన మూలమంత్రాన్ని 108సార్లు మూలమంత్రోచ్చారణ చేశామని వివరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్త్రీశక్తి సోషల్ స్ఫూర్తి ట్రస్టీ ప్రమీల, జోనల్ ఇంచార్జి రత్న కిశోర్‌బాబు పాల్గొన్నారు

ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా నేడు ధర్నా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల భారం మోపవద్దంటూ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు రమేష్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల్లో ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత 8,114 కోట్ల రూపాయలను ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ ధర్నాలో పాల్గొనాలని ఆయన కోరారు.

నిత్యావసరాలు పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు కారణంగా విజయవాడ నగరంలో వేలాది మంది ప్రజలు తమ సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన సంఘటనలు యావత్ మానవాళిని ఆందోళనలకు గురిచేశాయని జగతి ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా కళ్యాణి అన్నారు. బుడమేరు వరద ముంపునకు గురైన బాధితులకు కేర్ హాస్పిటల్స్ సహకారంతో జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ బూదాల ఆదాము కల్యాణ మండపంలో గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ రామ చంద్రమూర్తి, సింగ్‌నగర్ ఎస్ఐ సేనాపతి శ్రీనివాసరావు, ఏఎస్ఐ కోటేశ్వరరావు, జగతి ఫౌండేషన్ సభ్యులు, కేర్ హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా బీఆర్‌టీఎస్ రోడ్డు

- తరచూ ప్రమాదాలు
- పదుల సంఖ్యలో మరణాలు
- వందలాది మంది గాయాలపాలు



బీఆర్‌టీఎస్ రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ రోడ్డులో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా పదుల సంఖ్యలో మరణాలు చోటుచేసుకోగా, వందలాది మంది గాయాలపాలయ్యారు.

ప్రమాదాలు నిత్యకృత్యం..

బీఆర్‌టీఎస్ రోడ్డులో పమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ముఖ్యంగా మధురానగర్ శివాలయం నుంచి మాచవరం నార్లవారి వీధిలోకి వేళ్లే మలుపు ప్రాంతం భానూనగర్ జంక్షన్‌లో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు విశాలంగా ఉండటంతో వాహన చోదకులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పాదచారులు రోడ్డు దాటే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మధురానగర్ శివాలయం సమీపంలో మలుపు ఉండటంతో వేగంగా వచ్చిన వాహన చోదకులు ఒక్కసారిగా అడ్డువచ్చిన పాదచారులు, వాహనాలను ఢీ కొడుతున్నారు. ఇక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయటంతోపాటు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల అయోధ్యనగర్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తి విధులను నిర్వర్తించుకుని ఇంటికి వెళుతండగా వేగంగా వచ్చిన మరోద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, భర్త మృతి వార్తను తట్టుకోలేని భార్య ఆత్మహత్యకు పాల్పడింది. అలాగే కేంద్రీయ విద్యాలయం సమీపంలో వేగంగా దూసుకువచ్చిన కారు ఇరువురి మృతికి కారణమైంది.

కానరాని నివారణ చర్యలు..

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇంత మంది చనిపోతున్నా అధికారులు కనీసం ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవడం లేదు. కేసు నమోదు చేసి తమ పని పూర్తయినట్లు వ్యవహరిస్తున్నారు. అసలు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి. వాటికి అవసరమైన చర్యలు ఏమిటి అనే కోణంలో సంబంధిత అధికారులు ఆలోచించకపోవడం గమనార్హం.

నిరుపయోగంగా మధ్య రోడ్డు

బీఆర్‌టీఎస్ రోడ్డులో మధ్య ఓ రోడ్డును సిటీ బస్సుల కోసం ప్రత్యేకంగా నిర్మించారు. అయితే ఈ మార్గంలో కనీసం ఒక్కటంటే ఒక్క సిటీ బస్సుకూడా నడవడం లేదు. నిర్మించిన సిటీ బస్టాప్‌లు సైతం తుప్పుపట్టిపాడవుతున్నాయి. నిరుపయోగంగా మారిన మధ్య రోడ్డును వినియోగంలోకి తీసుకురావడంతోపాటు బీఆర్‌టీఎస్ రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు



వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు



డాక్టర్ వేంకట రమణమూర్తిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. రామాయణ కావ్యాన్ని అద్భుతంగా రచించిన వాల్మీకి మహర్షి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..

విజయవాడస్పోర్ట్స్: ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మధుర కావ్యాన్ని మనకు అందించిన గొప్ప కవి వాల్మీకి మహర్షి అని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. యుగాలు మారినా.. ఆదర్శంగా నిలిచేలా సమాజానికి రామాయణాన్ని అందించారని కొనియాడారు. రామాయణ మహాకావ్యాన్ని సంకలనం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి కమిషనర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని వాల్మీకి మహర్షి తొలిసారిగా సంస్కృత శ్లోకాలతో రచించారని గుర్తుచేశారు. రామాయణ మహాగ్రంథం ద్వారా మానవ కుటుంబ సంబంధాలను సమాజానికి తెలియజేశారన్నారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. రామాయణం స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవించాలని కోరారు.

గురుకుల కళాశాలలో ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక గురుకుల కళాశాలలో శ్రీమద్రామాయణ మహాకావ్యాన్ని లోకానికి అందించిన మహాకవి మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ఉపద్రష్ట వేంకట రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని 'వాల్మీకి మహర్షి రామాయణ వైశిష్ట్యం' అనే అంశంపై ఉపన్యసించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కళాశాల స్థలాన్ని పరిరక్షించాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్యాక్రాంతమవుతున్న మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల స్థలాన్ని పరిరక్షించాలంటూ కళాశాల పూర్వ విద్యార్థులు గురువారం విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, డీఆర్ఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు విద్యనభ్యసించే ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అండగా ఉండి కళాశాల స్థలాన్ని కాపాడాలని కోరగా, కళాశాల స్థల పరిరక్షణకు పూర్తిసహకారం అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముందుగా కళాశాల స్థలానికి ఫెన్సింగ్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లంకా జానయ్య, దోనేపూడి శంకర్, దోనేపూడి కాశీనాథ్, యుగంధర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొండా ఉమాకు వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జిల్లాలో ఏపీ టెట్ పరీక్షకు 1,006 మంది హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టీఈటీ – 2024 ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో గురువారం 1,006 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలో ఆరు, తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో రెండు షిఫ్ట్‌లకు సంబంధించి 1,337 మంది అభ్యర్థులను కేటాయించగా అందులో 1,006 మంది హాజరు కాగా 331 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 1,207 మంది అభ్యర్థులను కేటాయించగా అందులో 898 మంది హాజరు కాగా 309 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్ట్‌కు సంబంధించి 130 మంది అభ్యర్థులను కేటాయించగా 108 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను ఒక గంట ముందుగా అనుమతించారు.

మంచినీటి కోసం అవస్థలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం పెట్రోల్ బంక్ వెనుక హనుమంతరావు వీధిలో మున్సిపల్ కొళాయిల ద్వారా సరిగా నీటి సరఫరా జరగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ వీధి మెరకలో ఉన్నందున పైపులైను ద్వారా మంచినీరు సరఫరా కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇన్నర్ పైపులైను నిర్మిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. వీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారుల వద్దకు పలుమార్లు వెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. దీంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులుపడుతూ వాటర్‌ప్లాంట్ల వద్ద క్యాన్‌ను రూ.20పెట్టి కొనుగోలు చేసి మంచినీరు తాగుతున్నమని హనుమంతరావువీధి వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా వీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



మంచినీటి సమస్యతో ఇబ్బందిపడుతున్న హనుమంతరావు వీధి వాసులు

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు

మా ప్రాంతంలో మంచినీటి సమస్య గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ సమస్యను పరిష్కరించి, మంచినీటిని అందించాలి.

–సీతమ్మ, స్థానికురాలు



ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు డిమాండ్

సోషలిస్టు కూటమి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని సోషలిస్టు కూటమి నాయకులు ఎల్ జైబాబు డిమాండ్‌చేశారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్రమోడీ అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని కోరారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జైబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం రోజురోజుకు తగ్గిపోయి ప్రైవేటు రంగం విస్తరిస్తోందన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేక ఎస్సీ, ఎస్టీ, బీసీలు అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకై చట్టం చేసి ఆయా వర్గాలను ఆదుకోవాలన్నారు. ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతోపాటు సోషలిస్టు నేతలు అధ్యక్షులు గోరంక అప్పలరాజు, ప్రధానకార్యదర్శి ఒర్సు వీరభాస్కర్, ఇతరపార్టీల నేతలు ఫణిరాజు, గిద్దా శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా మురుగుకాల్వ తవ్వకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో మురుగునీటి కాల్వలు సక్రమంగా లేవు. దీంతో కొద్దిపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు, ఖాళీస్థలాలు వర్షపునీటితో నిండిపోతున్నాయి. ఇలా వర్షపునీరు రోజులతరబడి నిలిచిపోయి దోమలు వృద్ధిచెందుతుండటంతో స్థానికులు నానాయాతన పడతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్లపైకి చేరి రాకపోకలకు సైతం ఇబ్బందికరంగా మారుతోంది. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా కనీస చర్యలు తీసుకోలేదు. 32వ డివిజన్‌లో వరద నీరు తగ్గే వరకు 35 మోటార్లు ఏర్పాటు చేసి వరద నీటిని తోడిన అధికారులు ఇక్కడ కనీసం ఒక్కటంటే ఒక్క మోటారు కూడా ఏర్పాటు చేయలేదని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఇక అధికారులతో లాభం లేదని గ్రహించిన స్థానికులు తలా కొంత నగదు వేసుకుని జేసీబీ సాయంతో స్వచ్ఛందంగా కాల్వలను తవ్వించే కార్యక్రమం చేపట్టారు. దావు బుచ్చయ్యకాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అర్జా వెంకటేశ్వరరావు, బాబూరావు, మధు, సూర్యనరసింహమూర్తి, ఉండి శ్రీనివాసరావు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్న పారిశుద్ధ్యంతో ప్రజలకు అవస్థలు

మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. డోర్ టూ డోర్ చెత్త కలెక్షన్ చేపట్టకపోవడంతో కాలనీల్లో పారిశుద్ధ్య పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతోందన్నారు. నియోజకవర్గంలో ముఖ్యంగా వాంబేకాలనీ, న్యూఆర్ఆర్ పేట, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. చిన్న సందులోనే దాదాపు ఐదారు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని అన్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కాలనీల్లోని జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్–2కి సంబంధించి ఒక ఏఎంహెచ్ఓ, ఇద్దరు సూపర్ వైజర్లు, 20 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 96 మంది శానిటరీ సెక్రటరీలు, 1,200 మంది వర్కర్లు ఉన్నప్పటికీ పారిశుద్ధ్యం ఏమాత్రం మెరుగుపడటం లేదన్నారు. ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో.. ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వరదల సమయంలో శానిటేషన్ కు రూ. 52 కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పారిశుద్ధ్య పరిస్థితిలో ఏమాత్రం మార్పులేకపోవడంలో ఆంతర్యమేమిటో పాలకులు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిత్యావసరాలు, కూరగాయల ధరలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు విపరీతంగా పెంచిన కూటమి ప్రభుత్వం.. చెత్త పన్ను రద్దు చేశామని ఆర్భాటంగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 25 వేల టన్నుల చెత్తను ఈ ప్రాంతం నుంచి తరలించి.. ఎక్సెల్ ప్లాంట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు వరుసగా మూడేళ్ల పాటు కేంద్రం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. కానీ నేడు ప్రభుత్వ చేతగానితనం కారణంగా నగరం చెత్తకుప్పలకు కేరాఫ్ అడ్రస్‌గా మిగిలిపోతోందన్నారు. నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో పరిస్థితి మరీ దారుణంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి కాల్వల్లో పూడిక తీయించడంతోపాటు పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



మల్లాది విష్ణు

పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరగాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం అజిత్ సింగ్ నగర్, బుడమేరు వంతెన, ఇందిరానాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పారిశుద్ధ్యం నిర్వహణను పరిశీలించారు. బుడమేరు కెనాల్ బండ్ శుభ్రం చేయాలన్నారు. బుడమేరు కాలువలో ఉన్న గుర్రపుడెక్కను తొలగించి, ప్రజలకు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

సమన్వయంతో పని చేయాలి..

అనంతరం వీఎంసీ కమిషనర్ ఇందిరానాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ప్రజారోగ్య విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండటం గమనించి, ఖాళీ స్థలాల్లో ఉన్న వర్షపు నీటిని మిషన్లతో తోడించాలని, వ్యర్థాలను తొలగించి, వర్షపు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా జరగాలంటే ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటరీ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో సమన్వయంతో పని చేస్తే నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచవచ్చని చెప్పారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈ (వర్క్స్) పి.సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సింగ్‌నగర్‌లో ఖాళీ స్థలాల్లో ఉన్న వ్యర్థాలను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఎన్‌సీసీ విద్యార్థులకు షూస్ పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అన్నసంతర్పణ సమితి అధ్యక్షులు గుండుదిలీప్ సూచించారు. అజిత్‌సింగ్‌నగర్ ఎంకేబేగ్ స్కూల్‌లో గురువారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన ట్రస్ట్ సభ్యుల సహకారంతో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు షూస్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అన్నసంతర్పణ సేవాసమితి ద్వారా అన్నార్తుల ఆకలితీర్చడంతోపాటు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారం అందజేస్తున్నామన్నారు. అందులోభాగంగా ఇప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్‌లకు అవసరమైన షూస్‌ను అందిస్తున్నామని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరసా వెంకటేశ్వరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్‌వీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు షూస్ అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సేవలు అందజేస్తున్న అన్న సంతర్పణ సేవాసమితి ట్రస్ట్ సభ్యులను అభినందించారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యసాధనలో విజయాలు సాధించాలని సూచించారు.



ఎన్‌సీసీ విద్యార్థులకు షూస్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు



విక్రయానికి ఉంచిన కొబ్బరికాయలు



కొబ్బరికాయలో పువ్వు తీస్తున్న దృశ్యం

కొబ్బరి పువ్వు భలే టేస్ట్ గురూ !

విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై రాజమండ్రి నుంచి తెచ్చిన కొబ్బరి పువ్వులను ఓ వీధి వ్యాపారి విక్రయిస్తున్నారు. ఆ మార్గంలో ప్రయాణించే వారు కొబ్బరి పువ్వులను ఆసక్తిగా తిలకించారు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా 'క్లిక్'మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బాధితుల కోసం విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట ఏలూరు రోడ్డు శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు సీఎం సహాయనిధికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన గోకర్ణేశ్వరరావును సీఎం చంద్రబాబు అభినందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నట్లు గోకర్ణేశ్వరరావు వివరించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com